నేడు జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లాలోని కోర్టుల ప్రాంగణాల్లో శనివారం నిర్వహించనున్నారు. అదాలత్‌ను విజయవంతం చేసేందుకు కొద్దిరోజులుగా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, సమీక్షలు నిర్వహించారు. రాజీపడదగిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఠాణాల వారీగా ఎక్కువ కేసులు పరిష్కరించేలా లోక్ అదాలత్‌లో అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

పర్యాటక క్షేత్రాల సందర్శనతో సరికొత్త అనుభూతి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత పర్యాటక కేంద్రాలను సందర్శించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా సంఘాలు, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థులు, జిల్లా యువజనోత్సవాల విజేతలతో చంద్రుగొండ మండలం బెండాలపాడు, కనిగిరి గుట్టల విహారయాత్ర శుక్రవారం చేపట్టారు. 100మందితో బయల్దేరిన విహారయాత్ర బస్సులను కలెక్టరేట్ వద్ద కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత తీరిక ఉన్న వేళల్లో సమీప పర్యాటక క్షేత్రాలను సందర్శిస్తే కొత్త విషయాలు తెలియడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. డీవైఎస్‌వో ఎం.పరంధామరెడ్డి, జిల్లా మైనార్టీ అధికారి ఎ.సంజీవరావు, కొత్తగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వనజ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ పూర్ణచందర్, జిల్లా అథ్లెటిక్స్, బాక్సింగ్, కరాటే అసోసియేషన్ల కార్యదర్శులు మహిధర్, రమేష్, శ్రీధర్, ఆర్చరీ, అథ్లెటిక్స్, హాకీ కోచ్‌లు కోచ్ కళ్యాణి, నాగేందర్, ఇమామ్ పాల్గొన్నారు.



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, చిత్రంలో అధికారులు

సొంతింటి కల.. సాకారమయ్యేలా..!

ఈటీవీ, ఖమ్మం

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మరో కీలక ముందడుగు పడింది. నిరుపేదల దశాబ్దాల సొంతింటి కల సాకారమయ్యేలా ప్రభుత్వం కార్యాచరణకు సమాయత్తమవుతోంది. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపికకు ముహూర్తం ఖరారైంది. దసరా తర్వాత ఉభయ జిల్లాల్లో మండలాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగనుంది. తొలిదఫాలో ప్రతి శాసన సభ నియోజకవర్గానికి 3,500 మంది చొప్పున లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేయనుంది.



ఉభయ జిల్లాల్లో 35,000 మందికి గృహయోగం దక్కనుంది. వీటితోపాటు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని నిర్ణయించింది. నిర్మాణంలో ఉన్నవాటిని త్వరితగతిన పూర్తిచేసేలా ప్రణాళికలు రచిస్తోంది. రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించటంతో లక్షలాది మంది నిరుపేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రెండు పడక గదుల గృహాలు సైతం

గత ప్రభుత్వ హయాంలో నిర్మించి పంపిణీకి నోచుకోని రెండు పడక గదుల ఇళ్లను సైతం లబ్ధిదారులకు అందించనున్నారు. ఖమ్మం జిల్లాలో 8,956 ఇళ్లు మంజూరవగా 5,523 గృహాలను ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించారు. మిగతా ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 6,443 ఇళ్లు మంజూరవగా 2,008 గృహాలు పూర్తయ్యాయి. 1,164 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. మరో 844 ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే నిర్మితమైన గృహాలను ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు అందించనున్నారు. నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తిచేసి కేటాయించనున్నారు.

త్వరలో దరఖాస్తుల పరిశీలన

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల వారీగా దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి భద్రాద్రి జిల్లాలో 2,79,638, ఖమ్మం జిల్లాలో 2,24,600 దరఖాస్తులు అందాయి. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం గతంలోనే కొన్ని మార్గదర్శకాలు వెలువరించింది. తొలుత సొంత జాగా కలిగిన ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, ఇతరులకు రూ.5లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి అందిస్తామని ప్రకటించింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపికపై ఇప్పటికే కార్యాచరణ రూపొందించింది. దసరా నాటికి ఈ ప్రక్రియను కొలిక్కి తీసుకురావాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సర్కారు నుంచి ఆదేశాలందాయి. 'ప్రజాపాలన'లో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లోనే ప్రారంభమవనుంది. అక్టోబరు 15 నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈమేరకు తొలుత లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేకంగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. వార్డు, గ్రామ, పట్టణ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి కమిటీల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానం కల్పించనున్నారు. ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను అనుసరించి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేయటంలో ఈ కమిటీలు కీలక పాత్ర పోషించనున్నాయి.

కార్పొరేషన్ దిశగా జంట పట్టణాలు..!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం
కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

కొత్తగూడెం, పాల్వంచ పురపాలికలతో కార్పొరేషన్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. దశాబ్దాల క్రితం నుంచి పారిశ్రామిక ప్రాంతాలుగా వెలుగొందుతున్న పాల్వంచ, కొత్తగూడెం పురపాలికలను కలిపి కార్పొరేషన్‌గా మార్చాలనే స్థానికుల ఆకాంక్షను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ పెద్దలు కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలందటంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలోనే ప్రభుత్వానికి పంపించనున్నట్లు సమాచారం. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారిస్తే మార్గం సుగమమవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కార్పొరేషన్‌లో విలీనమవనున్న ప్రతిపాదిత ప్రాంతాల వివరాలు..

ప్రాంతం	చ.కి.మీ.	2011లో జనాభా	2021లో జనాభా అంచనా
కొత్తగూడెం	15.87	79,850	97,337
పాల్వంచ	40.87	80,144	89,721
కోమటిపల్లి	3.23	698	747
లక్ష్మీదేవిపల్లి	4.84	638	683
నిమ్మలగూడెం	1.76	603	645
మంగపేట	1.72	505	540
నాయకులగూడెం	3.03	1,562	1,671
సుజాతనగర్	8.61	5,321	5,693


కొత్తగూడెం పట్టణం

పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలు కార్పొరేషన్‌గా ఏర్పడితే వివిధ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు పొందవచ్చు. పాల్వంచ మున్సిపాలిటీకి ప్రత్యక్ష ఎన్నికలు లేకపోవటంతో ప్రత్యేకాధికారి పాలనలో సమస్యలు పేరుకుపోతున్నాయి. కార్పొరేషన్ ఏర్పాటుతో ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులు వస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.
- కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

ప్రతిపాదిత జాబితా ప్రకారం..

- ✦ కొత్తగూడెం, పాల్వంచ పురపాలికలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలు కోమటిపల్లి, లక్ష్మీదేవిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, నాయకులగూడెం, సుజాతనగర్ కలిపి కొత్తగూడెం కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయటం.
- ✦ సింగరేణి కాలరీస్, కేటీపీఎస్, నవభారత్, ఎన్ఎండీసీ వంటి పరిశ్రమలు ఈ రెండు మున్సిపాలిటీల పరిధిలో ఉన్నాయి.
- ✦ రెండు మున్సిపాలిటీలు పది కిలోమీటర్ల పరిధిలో ఒకదానికొకటి ఆనుకుని ఉన్నాయి.
- ✦ జిల్లాలోని మొత్తం అయిదు నియోజకవర్గాల్లో కొత్తగూడెం మాత్రమే జనరల్ రిజర్వేషన్ కలిగి ఉంది.
- ✦ పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలను కలిపితే జనాభా 1,97,037కు చేరుతుంది.

పన్ను వసూళ్ల యంత్రాలు మొరాయింపు

పాల్వంచ పురపాలికలో ఇంటి పన్నుల చెల్లింపుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోజువారీగా పన్నుల వసూళ్ల కోసం 'హ్యాండ్ హెల్డ్' యంత్రాలను వినియోగించేవారు. ఇప్పుడవి మరమ్మతులకు గురయ్యాయి. పురపాలికలోని 24 వార్డుల్లో జనాభా లక్షకు పైగా ఉంది. మొత్తం 22,500 గృహ, ఇతర సముదాయాలు (అసెస్‌మెంట్స్) ఉన్నాయి. వీటి నుంచి వార్షిక డిమాండ్ ప్రకారం పన్నులు వసూలు చేయాలి. పురపాలిక ఆదాయ మార్గంలో ఈ పన్నుల వాటాయే ఎక్కువ. కానీ, వసూళ్ల పరంగా అధికారుల అలసత్వం కనిపిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పన్ను చెల్లింపుదారులు కార్యాలయానికి వచ్చి నిరీక్షిస్తున్నారు. కొందరు ఇక్కడి వరకు వచ్చేందుకు సుముఖంగా లేరు.

- ❁ ఇంటి పన్ను డిమాండ్: రూ.5.12 కోట్లు
- ❁ ఇప్పటివరకు వసూలైంది: రూ. 1.56 కోట్లు (31%)
- ❁ ఆర్డర్ చేసిన కొత్త యంత్రాలు: 9



ఉన్నవన్నీ మూలకు..

పురపాలిక సిబ్బంది రోజువారీగా పన్నుల వసూళ్ల విధులు చేపట్టాలి. ఇందుకు సంబంధించి ప్రస్తుతం ఉన్న ఏళ్లనాటి ఎనిమిది యంత్రాలు మొరాయించాయి. ప్రస్తుతం కేవలం ఒకే యంత్రం.. అదీ అప్పుడప్పుడూ పనిచేస్తోంది. క్షేత్రస్థాయిలో వసూళ్లకు వెళ్లాల్సిన ఉద్యోగులు కార్యాలయంలోనే ఉంటున్నారు. ఫలితంగా వసూళ్ల లక్ష్యం మందగించింది.

☆ ఈ విషయాన్ని మేనేజర్ సత్యనారాయణ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకువెళ్లగా.. కొత్త మిషన్లను కొనుగోలు చేసేందుకు ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. అవి కేవలం నగదు చెల్లింపు రశీదులకే కాకుండా, స్వైపింగ్ మిషన్‌లా కార్డుల తోనే పన్నుల వసూలుకు దోహదపడతాయన్నారు. రేపో, మాపో వరంగల్ కార్యాలయం నుంచి అందుబాటులోకి రాగానే వాటి ద్వారా వసూళ్లు కొనసాగిస్తామని చెప్పారు.

- పాల్వంచ, న్యూస్‌టుడే

అక్రమాలకు ఆద్యులు అధికారులే..!

ఈటీవీ, ఖమ్మం

ఇంటి దొంగల గుట్టు కనిపెట్టడం అంత సులువు కాదనే సామెత ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పౌరసరఫరాల సంస్థ అధికారులకు అద్దినట్టే సరిపోతుంది. ఉభయ జిల్లాల్లోని వివిధ రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు సాగిస్తున్న దాడులు ఇందుకు ఊతమిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఏ సీజన్‌లో అప్పగించిన ధాన్యాన్ని, అదే సీజన్‌లో మరాడించి మిల్లర్లు ప్రభుత్వానికి బియ్యం అందించాలి. అయితే పదుల సంఖ్యలో మిల్లర్లు కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పక్కదారి పట్టించి, సర్కారుకు బురిడీ కొట్టించినా తమకేమీ పట్టనట్టు పౌరసరఫరాల సంస్థ అధికారులు వ్యవహరించటం చర్చనీయాంశంగా మారింది. మిల్లర్ల అక్రమాలకు అధికారులు వంతపాడినట్లు టాస్క్‌ఫోర్స్ బృందాల దాడుల్లో తేటతెల్లమవుతోంది.

'రూ.లక్షలకు లక్షలు అధికారులకు ముట్టజెప్పాం. చూసీచూడనట్లు వదిలేస్తామని మాట ఇచ్చి మళ్లీ ఈ దాడులు జరపటమేంటి' అని టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఖమ్మం జిల్లాలోని ఓ రైస్‌మిల్లు నిర్వాహకులు ప్రశ్నించటం చర్చనీయాంశమైంది.

ఖమ్మం జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నుంచి రూ.కోటి వసూలు చేసి అధికారులకు ముట్టజెప్పామని మరికొందరు మిల్లర్లు చెబుతుండటం గమనార్హం.

సీఎంఆర్ వ్యవహారంలో తమకు అనుకూలంగా ఉండేందుకు ఓ అధికారికి రూ.50 లక్షలు ముట్టజెప్పామని ఓ రైస్‌మిల్లు నిర్వాహకులు చెప్పటంతో టాస్క్‌ఫోర్స్ బృందం విస్తుపోయింది.


కొణిజర్ల మండలంలోని ఓ రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు (పాత చిత్రం)

ధాన్యం తీసుకొని.. బియ్యం అమ్ముకొని..

2023-24 వానాకాలానికి సంబంధించి ఖమ్మం జిల్లాలోని 66 మిల్లులకు 1,20,533.28 క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వం అప్పగించింది. మిల్లర్లు 80,903.06 క్వింటాళ్ల బియ్యం తిరిగి అప్పగించాల్సి ఉండగా 50,097.57 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారు. కనీసం 50 శాతం సీఎంఆర్ ఇవ్వని మిల్లులు 20 వరకు ఉన్నాయి. ఇంకొన్ని 10 శాతం సీఎంఆర్ కూడా అప్పగించలేదు. నిబంధనల ప్రకారం బియ్యం అప్పగించకపోతే కనీసం అందుకు తగిన ధాన్యం నిల్వలైనా మిల్లుల్లో ఉండాలి. ఆమేరకు టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో ధాన్యం నిల్వలు కనిపించకపోవటం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని మిల్లర్లు తీసుకొని మరపట్టిన బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని సీఎంఆర్ ఎగ్గొట్టినట్లు సమాచారం.

రూ.కోట్లలో ముడుపులు

రూ.కోట్లలో ముడుపులు తీసుకున్నందుకే ధాన్యం బయటకు తరలినా, సీఎంఆర్ ఇవ్వకున్నా పౌరసరఫరాల సంస్థ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈవ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లటం, ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగటం.. ముడుపుల రూపంలో ఇచ్చిన రూ.కోట్లు పోయి క్రిమినల్ కేసుల పాలవుతుండటంతో మిల్లర్ల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది.

సీఎంఆర్ అప్పగించని రైస్ మిల్లులపై చర్యలు తీసుకుంటున్నాం. ఒక మిల్లుపై కేసు పెట్టాం. మరో రెండు మిల్లుల అంశం కోర్టు పరిధిలో ఉంది. అధికారులపై ఆరోపణలు వాస్తవమని తేలితే చర్యలు తప్పవు.
- మధుసూదన్‌నాయక్, అదనపు కలెక్టర్, ఖమ్మం

సీనియర్ సిటిజన్ల ప్రదర్శన


పట్టణంలో ప్రదర్శన చేస్తున్న సీనియర్ సిటిజన్లు

కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి: అంతర్జాతీయ సీనియర్ సిటిజన్ల దినోత్సవం సందర్భంగా తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, పలు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పోస్టాఫీస్ సెంటర్ నుంచి బస్టాండు వరకు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్యసేవలు, ప్రయాణ రాయితీలు, రూ.1.50లక్షల్లోపు ఆదాయం ఉన్నవారికి ఆసరా పింఛన్లు మంజూరు చేయాలన్నారు. సురేశ్‌కుమార్, పాండురంగారావు, శివరామకృష్ణ, బత్తుల కృష్ణయ్య, ధర్మారావు, మైనేని నాగేశ్వరరావు, కేశవరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్ర సాధనకు లక్ష్మణ్ బాపూజీ పోరాటం: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్: ప్రత్యేక తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. జిల్లా బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఇ.ఇందిర, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, మహిళా సంక్షేమాధికారి విజేత, కలెక్టరేట్ ఏఓ ఎం.రమాదేవి, బీసీ సంఘం నాయకులు మోత్కూరి ధర్మారావు, గుమలాపురం సత్యనారాయణ, కొదుమూరి సత్యనారాయణ, చిప్పా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భద్రాచలం: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాలకు ఆశాదీపంగా మారి ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించిన ఘనత ఆయన సొంతమని పీఓ రాహుల్ కొనియాడారు. అన్ని వర్గాల సఖ్యతకు అలుపెరగని కృషిచేశారని శ్లాఘించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, యూనిట్ అధికారులు పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పీఓ రాహుల్, యూనిట్ అధికారులు

విద్యార్థులకు అపార నష్టం..!

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాల 1969లో ప్రారంభమైంది. అప్పటి నుంచి పౌరశాస్త్రం (సివిక్స్) సబ్జెక్టును బోధించేందుకు రెగ్యులర్ అధ్యాపకులను నియమించలేదు. హిస్టరీ (చరిత్ర) బోధిస్తున్న అధ్యాపకులకే ఈ బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి మొత్తం 80 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో సివిక్స్ సబ్జెక్టు బోధించాల్సి వస్తోంది. ఉభయ జిల్లాల్లోని కళాశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీపై విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నారు. ఉన్నతాధికారులకు వినతిపత్రాలిస్తున్నారు. అయినా స్పందన ఉండటం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 14 జూనియర్ కళాశాలలున్నాయి. వీటిల్లో ఎంపీసీ, బైపీసీతో పాటు హెచ్ఈసీ (హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్), సీఈసీ (కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్) కోర్సులు నిర్వహిస్తున్నారు. వీటిల్లో ఇల్లెందు, గుండాల, టేకులపల్లి, పాల్వంచ, బూర్గంపాడు, దుమ్ముగూడెం, కొత్తగూడెం, ములకలపల్లి కళాశాలల్లో.. ఖమ్మం జిల్లాలోని 19 జూనియర్ కళాశాలలకు గాను నాలుగైదు చోట్ల సివిక్స్ బోధనకు ప్రత్యేకంగా అధ్యాపకుల్లేరు. కేవలం మార్కుల కోసమే కాకుండా.. పౌరశాస్త్రంపై నేటితరానికి అవగాహన అవసరమని రాజనీతిశాస్త్ర నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పౌరహక్కులు, బాధ్యతలు, నాగరికత, ప్రజాస్వామ్యం, చట్టాలు ఎలా రూపొందుతాయి? ప్రభుత్వాల తీరుపై విద్యార్థులు అధ్యయనం చేసే దిశగా ఆసక్తికర బోధన సాగించాలని చెబుతున్నారు. 'అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని ఇటీవల అధికారులు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విన్నవించాం' అని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేశ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



అధ్యాపకులను నియమించాలని ఇల్లెందులో పీడీఎస్‌యూ ధర్నా (పాత చిత్రం)

"సివిక్స్ అధ్యాపకుల కొరత ఏళ్లుగా వేధిస్తోంది. ప్రభుత్వం అధ్యాపక నియామకాలు చేపట్టాల్సి ఉంది. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించాం."
- రామలింగేశ్వరరావు, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూ.కళాశాల, ఇల్లెందు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు, డీఈఓ వెంకటేశ్వరాచారి

ముగిసిన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడాపోటీలు

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల ప్రాధాన్యాన్ని విద్యార్థులు గుర్తించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం ప్రకాశం మైదానంలో జిల్లా స్థాయి పాఠశాలల క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. డీఈఓ వెంకటేశ్వరాచారి, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

విజేతలు వీరే: అండర్-17 వాలీబాల్ బాలురలో భద్రాచలం, బాలికల్లో ఇల్లెందు, కబడ్డీ బాలురలో పాల్వంచ, బాలికల్లో ఇల్లెందు, ఖోఖో బాలురలో అశ్వారావుపేట, బాలికల్లో ఇల్లెందు, అండర్-14 వాలీబాల్ బాలురలో ఇల్లెందు, బాలికల్లో భద్రాచలం, కబడ్డీ బాలురలో పాల్వంచ, బాలికల్లో ఇల్లెందు, ఖోఖో బాలురలో అశ్వారావుపేట, బాలికల్లో చంద్రుగొండ జోన్.

చారిత్రక వంతెనలు.. నిర్లక్ష్యానికి ప్రతీకలు..!



ఖమ్మం కాల్వొడ్డు వంతెనపై మొలిచిన మొక్కలు



వైరా జలాశయం ఆనకట్టపై మొలిచిన మొక్కలు



కాల్వొడ్డు వంతెనపై పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన గోడలు

ఇటీవల మున్నేరు మహోగ్రరూపం దాల్చినప్పుడు పరీవాహక ప్రాంతమంతా అతలాకుతలమైంది. 128 ఏళ్ల కాల్వొడ్డు వంతెన మాత్రం చెక్కు చెదరలేదు. అయితే ఈ వంతెనకు రెండువైపులా మొక్కలు పెరుగుతున్నాయి. పక్క గోడలు పెచ్చులూడి ప్రమాదకరంగా మారుతున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తేనే వంతెన పటిష్ఠంగా ఉంటుందని పలువురు స్థానికులు చెబుతున్నారు. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ డీఈ చంద్రశేఖర్ 'ఈనాడు'తో మాట్లాడుతూ రాగి, మర్రి మొక్కల వేర్లు బండరాళ్ల లోపలికి వెళ్లాయన్నారు. వాటిని పూర్తిస్థాయిలో తొలగిస్తే రాళ్లు కదిలే అవకాశముందని తెలిపారు. మూడు నెలలకోసారి మొక్కలను తొలగిస్తున్నామని చెప్పారు. పెచ్చులూడిన సైడ్ వాల్స్‌కు మరమ్మతులు చేయిస్తామన్నారు. వందేళ్ల క్రితం నిర్మించిన వైరా జలాశయం ఆనకట్ట సైతం నిర్లక్ష్యానికి గురవుతోంది. ఆనకట్ట లోపలి భాగంలో మొక్కలు మొలుస్తున్నాయి. వీటిని తొలగిస్తామని నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాస్ తెలిపారు.

– ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, వైరా

రూ.81.40 లక్షలకు వ్యాపారి ఐపీ దాఖలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన తోడేటి వెంకన్న రూ.81,40,000కు ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం ఐపీ దాఖలు చేశాడు. మొత్తం 52మంది రుణదాతలను ప్రతివాదులుగా చేర్చాడు. కేసు వివరాల ప్రకారం.. మొదట ఆటో నడుపుతూ జీవనం సాగించే పిటిషనర్ వెంకన్న అనంతరం సమీప గ్రామాల్లో దుస్తుల వ్యాపారం చేశాడు. ఈ రెండింట్లో వచ్చిన ఆదాయంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆరంభించాడు. ఇందుకోసం అప్పులు తీసుకున్నాడు. కొవిడ్‌తోపాటు అనారోగ్య కారణాలతో వ్యాపారంలో నష్టాలు వచ్చి బాకీలు తీర్చే పరిస్థితి లేదని, తనను దివాలాదారుగా ప్రకటించాలని పేర్కొంటూ కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

కాటేస్తే చేటు.. జాగ్రత్తలే మేలు!

ఉభయ జిల్లాల్లో పెరుగుతున్న రేబిస్ వ్యాధి కేసులు



కరిచింది కుక్కే కదా? అని కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అది మంచిదైనా, పెంచుకునేదైనా? టీకాలు వేయించుకోవడం తప్పనిసరి అన్నది వైద్య నిపుణుల సూచన. దురదృష్టం కొద్దీ రేబిస్ సోకితే.. అది ప్రాణాలకే ముప్పు. నేడు 'ప్రపంచ రేబిస్ దినం'.

ఖమ్మం వ్యవసాయం, కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

కుక్కలు, నక్కలు, తోడేళ్లు, కోతులు, గబ్బిలాల వంటి వాటి ద్వారా మనుషులకు సోకేది.. ముందస్తు నివారణ తప్ప చికిత్స లేని వ్యాధి 'రేబిస్'. వ్యాధి సోకిన వ్యక్తులు, జంతువులు భిన్న ప్రవర్తనతో, విచక్షణ రహితంగా దాడి చేసే స్వభావం కలిగి ఉంటారు. ఆపై పక్షవాతం, నాడీ వ్యవస్థ నిర్వీర్యం ద్వారా ప్రాణాపాయం సంభవిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

సంతతి నియంత్రణ.. వ్యాక్సినేషన్


ఖమ్మం జిల్లాలో 7,500 వీధి, 22,000 పెంపుడు కుక్కలు న్నాయని అంచనా. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు 5,000 వీధి శునకాలను గుర్తించారు. వీటిల్లో 3 వేల కుక్కలకు సంతతి నియంత్రణ శస్త్రచికిత్స, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ చేశారు. ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానాల్లో కలిపి 20,918 మంది కుక్కకాటుకు చికిత్స పొందడం విశేషం. ఉమ్మడి జిల్లాలో ఈ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో అన్ని పశువైద్య శాలల్లోనూ రేబిస్ టీకాలు సిద్ధంగా ఉంచుతున్నారు. ఖమ్మం, కొత్తగూడెంలలో ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రతి స్థానిక సంస్థ పరిధిలో వీధి కుక్కల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ కొన్నాళ్లుగా వినిపిస్తోంది.

కుక్కలు కనిపించినా.. కరిచినా.. ఇలా చేయండి

ఉమ్మడి జిల్లాలో రేబిస్ వ్యాధి ఎక్కువగా కుక్కకాట్లతో వ్యాపిస్తోందని వైద్యులు తేల్చారు. ఎప్పుడైనా వీధిలో శునకం తారసపడితే కలవరం చెందొద్దు. భయంతో దాని కళ్లల్లోకి నేరుగా చూడొద్దు. ఆగకుండా నెమ్మదిగా నడకను సాగించాలి. కంగారుతో రాళ్లు విసరడం వంటివి చేయొద్దు. వీధికుక్కలైతే ఆహారాన్ని దగ్గర్నుంచి అందించొద్దు. చిన్నారులను ఒంటరిగా బయటకు పంపొద్దు. ఎక్కడైనా పిచ్చి ఎక్కినవి తారసపడితే వెంటనే పురపాలక, స్థానిక సంస్థల అధికారులకు తెలపాలి. వాటి విసర్జితాలను తొక్కినా ఇబ్బందేనని గమనించాలి. ఒకవేళ కుక్కకాటుకు గురైతే ఆ గాయాన్ని కార్బాలిక్ యాసిడ్ సబ్బుతో పంపు కింద బాగా కడగాలి. ఆ తర్వాత సమీప పశువైద్యశాల, ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ టీకాలు తీసుకోవాలి.

తగిన జాగ్రత్తలు అవసరం

- డా.బి.వేణుమనోహర్‌రావు, జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ, ఖమ్మం



'రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం. ఈ క్రమంలో ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని కళాశాలలు, విద్యాసంస్థల్లో నేడు (శనివారం) విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నాం. కుక్కలైనా, కోతులైనా మానవుల తప్పిదాలవల్లే జనావాసాల్లోకి వస్తున్నాయి. వాటి కాటుకు గురవకుండా జాగ్రత్తపడటం మేలు.

శిక్షణ శిబిరం సందర్శన

చండ్రుగొండ: మండలంలోని మంచికంటి నగర్ సహాయకులకు ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. మిషన్ భగీరథ ఈఈ తిరుమలేశ్ పరిశీలించారు. పంచాయతీల్లో తలెత్తే చిన్న చిన్న మరమ్మతులను స్థానికంగానే సరిచేసేందుకు ఈ సహాయకులకు ఇస్తున్న శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ శిబిరాన్ని మిషన్ భగీరథ డీఈ ఇంజినీర్ కె.శ్రీనివాస్ సందర్శించారు. శిబిర బ్రోచర్‌ను విడుదల చేశారు. మిషన్ భగీరథ కొత్తగూడెం డీఈ శివయ్య, ఎంపీడీవో అశోక్, ఏఈలు హరికృష్ణ, సాయికృష్ణ పాల్గొన్నారు.

ప్రపంచ సాహితీ సదస్సుకు ప్రభాకరాచార్యులు ఎంపిక



అశ్వారావుపేట: ఖతార్ దేశం దోహాలోని ఎంఇఎస్‌ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నవంబరు 22, 23న జరిగే సాహితీ సదస్సుకు అశ్వారావుపేటకు చెందిన సినారె పురస్కార గ్రహీత సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు ఎంపికయ్యారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళావేదిక ఖతార్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు తొమ్మిదో సాహితీ సదస్సులో ఆయన పాల్గొనున్నారు. 'తెలుగు సాహితీవనంలో వ్యంజకాలు' అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నట్లు ప్రభాకరాచార్యులు తెలిపారు. ఆయన ఎంపికపై భానూదయ సాహితీ సంస్థ గౌరవాధ్యక్షుడు ఎన్.రవి, కార్యదర్శి రామారావు, మడిపల్లి వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

ఎస్‌బీఐలో చోరీకి యత్నం

మధిర, న్యూస్‌టుడే: మధిర పట్టణంలోని వైరా రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ సిరిపురం బ్రాంచిలో గురువారం రాత్రి దుండగులు చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. శుక్రవారం బ్యాంకుకు వచ్చిన మేనేజర్ ఉమేష్‌కుమార్ యాదవ్, సిబ్బంది విషయం గ్రహించి పోలీసులకు సమాచారమిచ్చారు. పట్టణ ఎస్సై సంధ్య, సిబ్బందితో వచ్చి బ్యాంకును పరిశీలించారు. వైరా ఏసీపీ రెహ్మాన్ కూడా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు వెనక వైపు తాళాలు పగులగొట్టి దుండగులు లోపలికి వచ్చారని, లాకర్లను బ్రేక్ చేసేందుకు ప్రయత్నించి విఫలమైనట్టు వివరించారు. అలారం మోగటంతో చోరులు పారిపోయినట్టు తెలిపారు. వివరాల సేకరణ తర్వాత ఎలాంటి నగదు, ఆభరణాలు అపహరణకు గురికాలేదని మేనేజర్ నిర్ధారించారు. ఏసీపీ క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్‌బీఐ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంధ్య తెలిపారు.

నీటిని తోడేందుకు మరో నాలుగు మోటార్లు



నాగార్జున సాగర్ ఎడమ కాల్వపై తెగిపోయిన యూటీ సమీపంలో నీటిని తోడేందుకు యంత్రాంగం శుక్రవారం మరో నాలుగు మోటార్లను ఏర్పాటు చేసింది. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం పర్యటనలో భాగంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న నాలుగు మోటార్లకు తోడు మరో నాలుగు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎనిమిది మోటార్లు రేయింబవళ్లు పనిచేస్తూ 120 క్యూసెక్కుల నీటిని యూటీ బయట ప్రాంతం నుంచి కాల్వలో తోడేస్తున్నాయి. దీంతో పొలాల్లో నిల్చిన నీటి పరిమాణం భారీగా తగ్గింది.

– కూసుమంచి, న్యూస్‌టుడే

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ టూరిజం క్లబ్ ఏర్పాటు



క్లబ్ లోగో ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ మహ్మద్ జకీరుల్లా, వీరన్న, రమాసత్యవతి, ఎంవీ రమణ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యువ టూరిజం క్లబ్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహ్మద్ జకీరుల్లా ప్రారంభించారు. అనంతరం క్లబ్ లోగోను ఆవిష్కరించారు. యువతలో టూరిజం, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు క్లబ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ కోఆర్డినేటర్ ఎంవీ రమణ, ఐక్యూఏసీ పరీక్షల కంట్రోలర్ డాక్టర్ రమా సత్యవతి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వీరన్న పాల్గొన్నారు.

భద్రాచలాన్ని పరిశుభ్రంగా ఉంచండి: పీఓ



పంచాయతీ కార్మికులకు భద్రత, కాస్మొటిక్ వస్తువుల కిట్ పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం పట్టణం: భద్రాచలంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా ఉన్నాయని, ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భద్రాచలానికి భక్తులు, విద్యార్థులు, పర్యాటకులు వస్తుంటారని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తడి, పొడి చెత్త వేరుచేసేందుకు డంపింగ్ యార్డుకు తరలించాలని తెలిపారు. కార్మికులకు భద్రతా పరికరాలు, కాస్మొటిక్ వస్తువులు పీఓ పంపిణీ చేశారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, పంచాయతీ ఈఓ సీహెచ్ శ్రీనివాసరావు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ: ఐఐటీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గురుకులం పూర్వ విద్యార్థి బుక్యా సునీల్‌కుమార్‌కు ఐటీడీఏ పీఓ రాహుల్ ల్యాప్‌టాప్‌ను బహుమతిగా అందజేశారు. కామేపల్లి మండలం గోపాలపురం తండాకు చెందిన సునీల్‌కుమార్ పదో తరగతిలో 10జీపీఏ సాధించి గురుకులంలో ఇంటర్ చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఐఐటీ బోపాల్‌లో సీటు సాధించాడు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఏకాగ్రతతో అనుకున్నది సాధించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. సునీల్ తల్లి లలితకు ల్యాప్‌టాప్ అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఆర్థిక సాయం అందించేందుకూ కృషి చేస్తానని పీఓ పేర్కొన్నారు. ఏపీఓ డేవిడ్ రాజ్, పరిపాలన అధికారి రాంబాబు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో పొడిచి దివ్యాంగుడి హత్య



ఆలోత్ భావ్‌సింగ్

కామేపల్లి, న్యూస్‌టుడే: దివ్యాంగ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన కామేపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గోవింద్రాల గ్రామానికి చెందిన ఆలోత్ భావ్‌సింగ్ (32)కు తల్లిదండ్రులు లేరు. చిన్నపాటి పనులు చేస్తూ అదే గ్రామంలోని సోదరి ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి మద్యం తాగేందుకని కొందరు యువకులు భావ్‌సింగ్‌ను సమీప పంటచేల వద్దకు తీసుకెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున పంట చేలకు వెళ్లే రైతులు అతడి మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు, డాగ్ స్క్వాడ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించాయి. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి శవాగారానికి తరలించి పోస్టుమార్టం చేయించారు. మృతుడి అక్క అజ్మీరా మాంగు ఫిర్యాదుతో ఎస్సై సాయికుమార్ కేసు నమోదు చేశారు. హత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్న గ్రామ యువకులను పట్టుకొనేందుకు గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. హత్యకు కారణాలేమిటి? హంతకులు ఎవరు? అనేది దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామన్నారు. ఖాళీ మద్యం సీసాలను పగులగొట్టి.. వాటితో తల, శరీరంపై దాడిచేసి భావ్‌సింగ్‌ను హతమార్చినట్లు గాయాలను చూస్తే తెలుస్తోంది.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు



పెనుబల్లి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న ఉల్లిపాయల లోడు లారీని ఓ ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్ నుంచి ఏపీలోని ఏలూరుకు 13మంది ప్రయాణికులతో ప్రైవేటు బస్సు బయల్దేరింది. నిద్రమత్తులో ఉన్న బస్ డ్రైవర్ ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం సీతారాంపురం వద్ద ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. బస్సులో ఉన్న ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 12 మందికి స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులు పెనుబల్లి వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడ్డ హైదరాబాద్‌కు చెందిన పూర్ణచందర్‌రావును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. మిగతా వారు ప్రాథమిక వైద్యం చేయించుకొని వెళ్లిపోయారు.

ముగ్గురు నకిలీ మావోయిస్టుల అరెస్టు



చర్ల, న్యూస్‌టుడే: మావోయిస్టులమని చెప్పి లొంగిపోవడానికి వచ్చిన ముగ్గురు నకిలీ మావోయిస్టులను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బలోధ్ జిల్లాలో శుక్రవారం జరిగింది. వివరాలను పరిశీలిస్తే... లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసే మావోయిస్టులకు పునరావాసంతో పాటు నజరానాతో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో గత కొంత కాలంగా మావోయిస్టులు పెద్ద సంఖ్యలో లొంగిపోతున్నారు. డబ్బులు వస్తాయని ఆశ పడ్డారో ఏమో.. ఆ యువకులు మావోయిస్టులమని పోలీసులనే నమ్మించారు.

★ ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన మధు మోధియా, మంకు భోగం, ఓం ప్రకాశ్ నేతం అనే యువకులు బలోద్ ఎస్పీ కార్యాలయానికి లొంగిపోతామంటూ వచ్చారు. వాస్తవంగా బలోధ్ జిల్లాలో రెండు దశాబ్దాలుగా నక్సల్స్‌కు సంబంధించి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. ఈ క్రమంలో లొంగిపోవడానికి వచ్చిన ముగ్గురు యువకులపై నజర్ పెట్టిన పోలీసులు విచారణ చేపట్టారు. మావోయిస్టు పార్టీ మొహల్లా-మన్పూర్ ఏరియా కమిటీలో క్రియాశీలక సభ్యులుగా పనిచేస్తున్నట్లు పోలీసులతో ఈ ముగ్గురు యువకులు నమ్మబలికారు. అనుమానం వచ్చిన పోలీసులు వీరి గురించి తమదైన శైలిలో ఆరా తీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ యువకులు నకిలీ మావోయిస్టులని, డబ్బుకోసం లొంగిపోయే పథకం రచించారని విచారణలో తేలింది. దీంతో వీరిపై పోలీసులు చర్యలు చేపట్టారు.

వేధింపులు తట్టుకోలేకపోతున్నా..

◆ లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకుని..
◆ కదిరిలో యువకుడి బలవన్మరణం



ఉదయ్‌కుమార్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: 'పోలీసులతో పాటు ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతుల తల్లిదండ్రుల వేధింపులు భరించలేకపోతున్నా. అమ్మానాన్న నన్ను క్షమించండి. నేను చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన ఉదయ్‌కుమార్(35) గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని శుక్రవారం చనిపోయాడు. గతంలో కదిరిలో సీఐగా పనిచేసిన మధు, తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సీఐ శ్రీనివాస్ వేధింపులతోనే చనిపోతున్నట్లు లేఖలో పేర్కొన్నాడు. ఉదయ్‌కుమార్ సిద్దిపేటలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. మూడేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమించాడు. కదిరికి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదుతో అతడిపై సిద్దిపేట, కదిరిలో కేసు నమోదైంది. పోలీసులు యువకుడితో పాటు అతడి సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు తమ కుమారుడిని తీవ్రంగా కొట్టారని తల్లిదండ్రులు ఆరోపించారు.

పోలీసులపై జిల్లా న్యాయస్థానంలో ఫిర్యాదు

ఉదయ్‌కుమార్ జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోలీసులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆ కోపంతో పోలీసులు తమతోపాటు కుమారుడిని వేధింపులకు గురిచేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. 'కేసును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలంటూ హింసించారు. పోలీసుల వేధింపులతో ఉదయ్ తెలంగాణలోనే ఉండిపోయాడు' అని చెప్పారు. బాలిక దూరమయ్యాక అతడు భద్రాచలానికి చెందిన ఓ యువతిని, తర్వాత హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన మరో యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివిధ కారణాలతో వారిద్దరూ దూరమయ్యారు. పోలీసులు, యువతుల కుటుంబ సభ్యులు బెదిరించడంతో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు లేఖ రాసి ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

2న వైద్యాధికారి పోస్టుకు ముఖాముఖి

ఖమ్మం కమాన్‌బజార్: ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం నిర్వహిస్తున్న వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యాధికారి పోస్టులకు అక్టోబరు 2న ఉదయం 10గంటలకు సర్వజనాసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా నియామకం చేపట్టనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వి.సుబ్బారావు తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తిచేసి, తెలంగాణ మెడికల్ బోర్డులో రిజిస్టర్ చేసుకున్న 44 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, అంగవైకల్యం కలిగిన వారికి పదేళ్ల వయసు మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఔట్ సోర్సింగ్ విధానంలో ఎంపికైన వైద్యాధికారికి నెలకు రూ.58,500 పారితోషికం చెల్లించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

ఘనంగా రామయ్యకు స్వర్ణ కవచాల అలంకరణ



హీరో సుహాస్‌తో రామాలయ ఉద్యోగులు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు కొనసాగించారు. స్వర్ణ కవచాలంకారంలో దేవదేవుడు మెరిసిపోవడంతో వీక్షించిన భక్తులు మురిసిపోయారు. ఈ రూపంలో ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించారు. క్షేత్ర విశిష్టతను ప్రవచనం చేశారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక కొనసాగించారు. పుష్యమి సందర్భంగా సీతారామ పట్టాభిషేకం చేశారు. పుణ్య జలాలను భక్తులపై చిలకరించారు. దర్బారు సేవ, తన్మయత్వాన్ని నింపింది. శనివారం బంగారు తులసీ దళాల అర్చన ఉంటుందని వైదికపెద్దలు తెలపారు. ఇదే రోజున సర్వ ఏకాదశి సందర్భంగా లక్ష కుంకుమార్చన ఉంటుంది.

రామయ్యను దర్శించుకున్న హీరో సుహాస్: కలర్ ఫోటో, ప్రసన్న వదనం, అంబాజీపేట మ్యారేజిబ్యాండ్, రైటర్ పద్మభూషణ్ వంటి చిత్రాలలో కథానాయకుడిగా నటించిన సుహాస్ కుటుంబ సమేతంగా వచ్చి భద్రాచలం రాములవారిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్లు సాయిబాబా, శ్రీనివాసరావు వారికి సాదరంగా స్వాగతం పలకగా వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం కనబరిచారు.

ఆదాయం రాక.. ఆబ్కారీ అధికారుల హైరానా!

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే

ఎంత కాదన్నా ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు మద్యం విక్రయాలే. ప్రభుత్వం ఏటా మద్యం విక్రయాలకు లక్ష్యం నిర్దేశిస్తోంది. ఈ ఏడాది ఆదాయాన్ని గత ఏడాదితో పోల్చి చూస్తున్నారు. నెలవారీగా లక్ష్యాన్ని చేరుకోకుంటే ఉన్నతాధికారులు ప్రశ్నిస్తున్నారు. దీంతో జిల్లా ఆబ్కారీశాఖ ఉరుకులు పరుగులు పెడుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత ఏడాది అక్టోబరులో మద్యం విక్రయాల ద్వారా రూ.117 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 35 శాతం తగ్గడంతో శాఖ అధికారులు, సిబ్బంది హైరానా పడుతున్నారు. ఆబ్కారీశాఖ రాష్ట్ర సంయుక్త కమిషనర్ సురేష్ రాథోడ్ స్థానిక అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. ఆదాయం తగ్గడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల భారీ వర్షాలు, వరదలతో రాబడి తగ్గిందని ఇక్కడి అధికారులు చెప్పినట్లు తెలిసింది. వరద ప్రభావం కొన్ని ప్రాంతాల్లోనే ఉండగా.. ఉమ్మడి జిల్లాలో అన్ని స్టేషన్ హౌజ్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌ఓ)ల పరిధిలో లోటు ఎందుకొచ్చిందని ప్రశ్నించినట్లు



తెలుస్తోంది. దీనికి తోడు బార్ లైసెన్స్‌ల పునరుద్ధరణ కోసం చెల్లించాల్సిన మొత్తం సకాలంలో రావడం లేదు. తాము నష్టాల్లో ఉన్నామని, త్వరలో చెల్లిస్తామని బార్‌ల యజమానులు తెగేసి చెబుతుండటంతో ఆబ్కారీ అధికారులకు ఎటూ పాలుపోవడం లేదు. ఓ వైపు మద్యం విక్రయాల ఆదాయం తగ్గడం, మరోవైపు బార్ లైసెన్స్ ఫీజులు రాకపోవడంతో లక్ష్యం చేరుకుంటామా? లేదా అనే ఆందోళనలో ఉన్నట్లు తెలిసింది. ఖమ్మం జిల్లాలో ఏడు, భద్రాద్రి కొత్తగూడెంలో ఆరు ఎస్‌హెచ్‌ఓ స్టేషన్లు ఉన్నాయి. ఎలాగైనా లక్ష్యం చేరుకోవాలనే ఆదేశాలు రావడంతో తనిఖీలు పక్కన పెట్టి ఆదాయం పెంచే పనిలో నిమగ్నమయ్యారు. బార్లు, మద్యం దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు ఒక అడుగు ముందుకేసి జామీనుపై డిపో నుంచి దుకాణాల ద్వారా సరకు ఎత్తిస్తున్నారు. వాళ్లు కట్టలేకపోతే జామీను ఉన్న మా పరిస్థితి ఏమిటనే భయం కూడా అధికారుల్లో ఉంది. శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు రంగంలోకి దిగడాన్ని బట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆబ్కారీశాఖలోని పరిస్థితిని అంచనా వేయవచ్చు.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	4,500	7,011	6,700
పాతపత్తి	4,500	7,500	7,400
పెసలు	4,000	7,220	6,460
కందులు	5,200	9,200	9,000
ఏసీ ఎండుమిరప	12,000	20,000	17,000
ఎండుమిరప	11,200	18,200	15,000
ఏసీ తాలుమిరప	9,000	9,800	8,200

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

బాలింత మృతి: ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందంటూ ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి సత్తుపల్లి పట్టణంలోని ఓ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితుల కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం నాచారం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి శ్రావణి(21)కి ఏపీలోని చింతలపూడికి చెందిన వివేక్ వర్ధన్‌తో వివాహమైంది. నెలలు నిండిన శ్రావణిని గురువారం సత్తుపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకొచ్చారు. సిజేరియన్ చేయగా ఆడబిడ్డ జన్మించింది. శస్త్రచికిత్స అనంతరం శ్రావణికి తీవ్ర రక్తస్రావం కావటంతో ఖమ్మంకు, అనంతరం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. శస్త్రచికిత్స చేసిన ఆసుపత్రి వైద్యుల కారణంగానే శ్రావణి మృతి చెందిందంటూ కుటుంబ సభ్యులు సత్తుపల్లిలో ఆమె మృతదేహంతో ఆందోళన చేశారు. పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడుతున్నారు.

గుంతలు పూడ్చివేత

అశ్వాపురం, న్యూస్‌టుడే: మొండికుంట ప్రధాన కేంద్రం వద్ద నిత్యం రద్దీగాఉండే తుమ్మలచెరువు అడ్డ రోడ్డు వద్ద భారీ వర్షాలకు ర.భ.రహదారి అధ్వానంగా తయారైంది. అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. ఇక లాభం లేదనుకున్న గ్రామస్థులు జేసీబీ యజమాని మదు సహకారంతో మట్టిని తెచ్చి స్వచ్ఛందంగా గుంతలను పూడ్చివేశారు. గ్రామ పెద్దలు శ్రీనివాసరెడ్డి, రాములు, వజ్రదర్, రాంరెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: స్థానిక అంబేడ్కర్ వద్ద ఓ చెట్టు ప్రధాన రోడ్డుపై విద్యుత్తు తీగెలను తాకుతూ నిత్యం నిప్పులు రాలుతూ ప్రమాదకరంగా ఉంది. చెట్టు కొమ్మలు లేదా చెట్టును తొలగించే చర్యలు చేపట్టాలి. - సురేశ్, భద్రాచలం.
సమాధానం: పరిశీలించి చర్యలు చేపడతాం. - రాజారావు, విద్యుత్ శాఖ ఏఈ, భద్రాచలం. - భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

రాచర్లగూడెం పంచాయతీ పరిధిలోని మోటువారిగూడెం ప్రాథమిక పాఠశాల సమీపంలోని వీధి దీపాలు మూడు రోజులుగా వెలగడం లేదు. మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలి. - స్థానికులు, మోటువారిగూడెం
✔ వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. - కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాచర్లగూడెం.

వీధి దీపాలు ఏర్పాటు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: తూరుబాక గ్రామ పంచాయతీలో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న అంశంపై 'మేమున్నాం.. మీకు తోడుగా' లో ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి ఉబ్బా శ్వేత స్పందించారు. 40 వీధి దీపాలను ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు వందనం

రామాలయ భూ సేకరణకు రంగం సిద్ధం

దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ

భద్రాచలం, న్యూస్‌టుడే


రామాలయ మాడవీధులు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం అభివృద్ధికి తొలి అడుగు పడింది. భూ సేకరణకు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమాచారాన్ని రామాలయ ఈఓ రమాదేవి కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు చేరవేయనున్నారు. కలెక్టర్ అనుమతితో స్థల సేకరణ ప్రక్రియ ఉంటుందని వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ.60.20 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఇచ్చింది. తాజాగా వచ్చిన ఉత్తర్వుల మేరకు రామాలయ అభివృద్ధికి అవసరమైన స్థల సేకరణకు ఈ నిధిని వెచ్చించనున్నారు. 2013లోని యాక్ట్ నంబరు 30 ప్రకారం ఒక ఎకరం అర గుంట స్థలానికి నష్టపరిహారం ఉంటుందని స్పష్టత ఇచ్చారు. మాడవీధుల్లోని ఇళ్లకు సంబంధించిన ఐరావత మాడస్వర గుంటలు, రహదారుల ఐతర ఖాళీ స్థలం మరో 17 గుంటలను సేకరించాలని పేర్కొన్నారు. నిర్వాసితులకు న్యాయబద్ధమైన పరిహారం అందిస్తామని పేర్కొన్నారు. ఇళ్లను, స్థలాలను ఇచ్చిన వారికి పునరావాసం కల్పించి కాలనీ నిర్మించనున్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా ఈ ఖర్చులు చెల్లించనున్నారు.

నిర్వాసితులతో చర్చించాలి..

రామాలయ మాడవీధుల్లో ఉన్న స్థలం అత్యంత ఖరీదైనదని స్థానికులు పేర్కొంటున్నారు. పదేళ్లకు ముందు ఉన్న ధర లక్ష.. ఇప్పటికి ఎంతో మార్పు వచ్చిందని మార్కెట్ ధరలను పరిశీలించి పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా దేవుణ్ని నమ్ముకుని చిరు వ్యాపారాలు చేసే తమకు కొద్దిపాటి స్థలం ఇచ్చి పంపిస్తే ఉపాధి కోల్పోతామని, దీన్ని గుర్తించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. తాము కోరిన చోట పునరావాసం ఇవ్వాలని, వేరే ఊళ్లలోకాని మూల ప్రాంతాల్లోకాని కాలనీలను కట్టిస్తామంటే అంగీకరించేది లేదని పేర్కొంటున్నారు. దీనిపై ఓ వ్యాపారి ఇప్పటికే కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

✦ ఈ పరిస్థితుల్లో గత అనుభవాలను పరిశీలించి న్యాయపోరాటం చేసేవారిని గుర్తించాలి. ఆలయ అభివృద్ధికి సహకరించేలా కౌన్సెలింగ్ నిర్వహించాలి. అడ్డుగా ఉన్న 46ఇళ్లను తొలగిస్తేనే ఆలయ అభివృద్ధికి వీలవుతుందన్నది స్పష్టం. అన్నీ సజావుగా సాగితే భవిష్యత్తులో నాలుగు వైపులా గోపురాలు, రెండు ప్రాకారాలు, ఒక మాడవీధి, దీనికి సమీపంలో రహదారి అందుబాటులోకి రానుంది. దీనికి ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది.

అమలుకాని హామీలు.. అసంపూర్తి ఇళ్లు..!

నిరుపేదలకు గూడు కల్పిస్తామంటూ ప్రభుత్వం అసంపూర్తిగా నిర్మించిన గృహాలు వివరణ అలంకారప్రాయంగా మిగులుతున్నాయి. నిర్మాణంలో గుత్తేదారులు, అధికారులు కాలయాపన చేయడంతో సకాలంలో పనులు పూర్తికాక లబ్ధిదారులకు గృహాలు అందని ద్రాక్షలా మారాయి. మండల పరిధిలోని గోవిందాపురం, తూరుబాక, పెదనల్లబల్లి, అంజుబాక, మారాయిగూడెం గ్రామాల్లో 125 రెండు పడక గదుల గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో దానికి సుమారు రూ.5.05 లక్షలు కేటాయించింది.
– దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

రెండు పడక గదుల గృహాల నిర్మాణం పనులు 2020లో గుత్తేదారులు ప్రారంభించారు. ఆ సమయంలో హడావిడిగా వీటి నిర్మాణాలను చేపట్టి శ్లాబు వేసి కొంతకాలం పాటు పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు.

ఏళ్లు గడుస్తున్నా..

అనంతరం వీటి నిర్మాణ పనులు ముందుకు సాగని దుస్థితి. కొన్నింటికి తలుపులు, కిటికీలు ఏర్పాటు చేసి వదిలేశారు. రానురాను గృహాలు ఆనవాళ్లు లేకుండా దెబ్బతింటున్నాయి. గృహాల చుట్టూ మొక్కలు, పిచ్చిచెట్లు పెరిగి పొదలతో నిండిపోయాయి. రహదారి, తాగునీటి, విద్యుత్తు సదుపాయాలు కల్పించలేదు. వీటి నిర్మాణం పూర్తికాకముందే లబ్ధిదారుల ఎంపికను అధికారులు చేపట్టారు. కొందరు లబ్ధిదారులు పూర్తికాని ఇళ్లలోనే కొన్నాళ్లు నివాసం ఉన్నారు. అరకొర సదుపాయాల మధ్య ఉండలేక బయటకు వెళ్లిపోయారు. సంవత్సరాలు దాటుతున్నా వీటి పనులను గుత్తేదారులు పూర్తి చేయకపోవడంతో నిరుపేదలకు సొంతింటి కల చివరకు కలగానే మిగిలింది.


మారాయిగూడెంలో అసంపూర్తిగా గృహాలు

✦ ఈ పరిస్థితిపై ఐటీడీఏ ఏఈ వెంకటేశ్వరరావు 'న్యూస్‌టుడే'కు వివరణ ఇస్తూ గుత్తేదారులకు బిల్లులు చెల్లింపు పూర్తికాలేదని, పనులను సగంలోనే నిలిచిపోయాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

కొనసాగుతున్న పూడికతీత పనులు



మణుగూరు పురపాలక పరిధిలో ఉన్న కట్టువాగు పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. గత వారం రోజుల క్రితం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నేరెళ్ల చెరువు, కట్టువాగు పూడికతీత పనులను ప్రారంభించారు. నాటి నుంచి సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో కట్టువాగులో ఉన్న పూడికను పూర్తిస్థాయిలో జేసీబీ సహాయంతో తొలగిస్తున్నారు. దీంతో చాలాకాలంగా పిచ్చిమొక్కలతో నిండిపోయిన వాగులో నీరు ప్రవహిస్తుండటంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. – మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

హరిత తోరణం.. ఆహ్లాద స్వాగతం



ఖమ్మం - రాజమండ్రి జాతీయ రహదారి నుంచి అశ్వారావుపేట మండలం అచ్యుతాపురానికి వెళ్లే దారిలో నాలుగేళ్ల కిందట హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి పెరిగి వృక్షాలుగా ఎదిగాయి. పచ్చని ఆకులతో కొమ్మలు దారిపై పందిరిలా పర్చుకుని ఆ దారిలో ప్రయాణించే వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. – అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

యువతి అదృశ్యం.. కేసు నమోదు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలోని ఓ కాలనీకి చెందిన యువతి అదృశ్యమైన సంఘటనపై ఎస్సై పీవీఎన్ రావు శుక్రవారం కేసు నమోదు చేశారు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.

మర్కోడు వాసి..

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: ఆళ్లపల్లి మండల పరిధిలోని మర్కోడు గ్రామానికి చెందిన కడియాల రాజు(50) ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆయన భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రతీశ్ పేర్కొన్నారు.

పినపాకలో చోరీ

పినపాక, న్యూస్‌టుడే: పినపాక మండల కేంద్రానికి చెందిన విశ్వరూపాచారి ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడు కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లి వచ్చేసరికి తాళాలు ధ్వంసం చేసి బీరువాలోని రూ.7 వేలు దోచుకెళ్లినట్లు గుర్తించాడు. ఏడూళ్లబయ్యారం ఠాణాలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం పట్టివేత

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న బెల్లాన్ని అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రా నుంచి తెలంగాణలోకి భారీగా బెల్లం తరలిస్తున్నారన్న సమాచారంతో అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం నిఘా పెట్టారు. ఎస్సై రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన బోలోరా వాహనంలో 2,916కిలోల బెల్లాన్ని గుర్తించి వాహనాన్ని సీజ్ చేసి స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ బెల్లం విలువ సుమారు రూ.1.5 లక్షలు ఉంటుందని, దీన్ని తరలిస్తున్న జంగారెడ్డిగూడేనికి చెందిన మాణిక్యాల సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ బెల్లాన్ని అశ్వారావుపేట మండలంతోపాటు ఆంధ్రాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నారని పేర్కొన్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో జూద స్థావరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 మందిని అదుపులోకి తీసుకొని రూ.1.72 లక్షల నగదు, 11 చరవాణిలు, ఓ కారు, ఆటో, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కరకగూడెం, న్యూస్‌టుడే: పినపాక మండలం ఎల్చిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి కరకగూడెంలో 4 క్వింటాళ్ల రేషన్ బియ్యంకొని అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి ఆటో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

సీనియారిటీ ప్రకారమే క్వార్టర్ల కేటాయింపు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కార్మికుల సీనియారిటీని పరిగణలోకి తీసుకుని మాత్రమే క్వార్టర్లను కేటాయించడం జరిగిందని ఏరియా డీజీఎం పర్సనల్ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మణుగూరులోని ఎంవీటీసీలో క్వార్టర్ల కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఏరియా జీఎం ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న 48 ఎంసీ క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి నిబంధనల ప్రకారం కార్మికులకు కేటాయించామన్నారు. అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల ప్రాణాలతో చెలగాటం వద్దు

మణుగూరు సాంస్కృతికం: ఏరియాలోని కొంతమంది అధికారుల అండదండలతో కార్మిక సంఘాల నాయకులు కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని తెబొగకాసం ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ విమర్శించారు. మణుగూరులో శుక్రవారం మాట్లాడుతూ కేపీయూజీ గనిలో భూగర్భంలో పని చేస్తున్న కార్మికులకు ప్రాణవాయువు అందించే ఫ్యాన్ దగ్గర పని చేస్తున్న కార్మికుడు పని ప్రదేశాన్ని వదిలి ఇష్టానుసారం తిరుగుతూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధనకు ఈనెల 30న ఇఫ్టూ ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాసర్ పాషా అన్నారు. మణుగూరులోని వివిధ గనుల వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎంఈఓల బాధ్యతల స్వీకరణ

అశ్వారావుపేట, భద్రాచలం పట్టణం, ఆళ్లపల్లి, మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అశ్వారావుపేట ఎంఈఓగా పి.ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఎంఈఓగా బాధ్యతలు పర్యవేక్షించిన కీసర లక్ష్మి పూర్తికాలపు దమ్మపేట ఎంఈఓగా నియమితులయ్యారు. భద్రాచలం ఎంఈఓ(ఎఫ్ఏసీ)గా తోటమల్ల రమ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆళ్లపల్లి ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన కోరం శాంతారావుకు మర్కోడు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు. మణుగూరులోని భవిత ప్రత్యేక పాఠశాలను శుక్రవారం నూతన ఎంఈఓ స్వర్ణజ్యోతి సందర్శించారు.

'కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాటం'

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: సమాజంలో కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడదామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో వృత్తుల ఆధారంగా కుల వ్యవస్థ ఏర్పడిందని, పాలక వర్గాలు దీన్ని పెంచి పోషిస్తున్నాయని విమర్శించారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

దమ్మపేట, న్యూస్‌టుడే: దమ్మపేటకు చెందిన ఓ నిరుపేద విద్యార్థిని ఇంటర్ చదివేందుకు ఆర్థికస్థోమతలేక చదువుకు స్వస్తి చెప్పింది. విద్యార్థినికి చదువుపై ఉన్న ఆసక్తిని గమనించిన దమ్మపేట జడ్పీహెచ్ పాఠశాల కమిటీ అధ్యక్షుడు పాకనాటి శ్రీనివాసరావు ప్రముఖ పండితులు చామర్తి సాయిప్రసాద్‌శాస్త్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన విద్యార్థిని ఇంటర్ రెండు సంవత్సరాలకు అయ్యే ఫీజు రూ.30వేలు చెల్లించేందుకు ముందుకొచ్చారు. మొదటి సంవత్సరం ఫీజు రూ.15వేలు అందజేశారు. అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో చేర్పించారు.

'పొంగులేటిపై ఈడీ దాడులు రాజకీయ కుట్ర'

అశ్వాపురం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఈడీ దాడులు కేవలం రాజకీయ కుట్ర, కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత, పొంగులేటి శీనన్న సైన్యం కన్వీనర్ వాసు అన్నారు. అశ్వాపురంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం పొంగులేటి రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక పథకం ప్రకారం ఈ దాడులకు పూనుకుందన్నారు.

టైంస్కేల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి: సీఐటీయూ

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: వ్యవసాయ విశ్వవిద్యాలయం, హెచ్ఆర్ఎస్‌లలో పనిచేస్తున్న టైంస్కేల్, ఎన్ఎంఆర్, కాంటిజెంట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండు చేశారు. స్థానిక ఉద్యాన పరిశోధనా కేంద్రంలో షేక్ సాలర్ అధ్యక్షతన కార్మికుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.

ఠాణాను సందర్శించిన డీఎస్పీ

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: ఆళ్లపల్లి పోలీసు ఠాణాను ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను శుక్రవారం సందర్శించారు. కేసుల సంబంధిత రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన దారం కార్తీక్ ఫోక్సో కేసు వివరాలను సేకరించారు. ఫిర్యాదుదారులతో చర్చించారు.

ముగ్గురు వ్యక్తులకు రిమాండ్

అశ్వాపురం: అటవీ భూముల ఆక్రమణలకు పాల్పడిన ముగ్గురిని అశ్వాపురం అటవీశాఖ అధికారులు శుక్రవారం భద్రాచలం సబ్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఎఫ్ఆర్ఓ ఎస్.రమేశ్ కథనం ప్రకారం.. జగ్గారానికి చెందిన కంబాల వెంకన్న, మరో ఇద్దరు మిట్టగూడెం బీట్ పరిధిలోని అటవీ భూముల్లో ఆక్రమణలకు యత్నించడంతో కేసు నమోదైంది.

కనకగిరి గుట్టలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే జారే

చంద్రుగొండ, న్యూస్‌టుడే: కనకగిరి గుట్టలను రాష్ట్ర స్థాయిలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా చంద్రుగొండ మండలం బెండాలపాడు సమీపంలోని కనకగిరి గుట్టలపైకి ఎక్కేందుకు ఆయన వచ్చారు. ఆయనతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన సర్వీసుల అధికారి పరంధామరెడ్డి, మహిధర్‌లతో పాటు కొత్తగూడెం రామచంద్ర డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, పాల్వంచ సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థులు వంద మంది కనకగిరి గుట్టలపైకి వెళ్లారు. గుట్టలపై ఉన్న శివాలయం, కోనేరు, కాకతీయుల నాటి కట్టడాలను పరిశీలించారు. యువతను అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. తొలుత బాలికుంట గ్రామం నుంచి బెండాలపాడులోని వెదురు వస్తువుల తయారీ కేంద్రం వరకు ఎమ్మెల్యే జారేతోపాటు విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో అశోక్, రేంజర్ ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, ఏడుకొండలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


బెండాలపాడు సమీపంలోని కనకగిరి గుట్టల సమీపంలో మాట్లాడుతున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: వరదబాధితుల సహాయార్థం గ్రామాల్లో విరాళాలు సేకరిస్తున్న ముర్తాజా కళాబృందాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం అభినందించారు. కళాబృందంతో కలసి డప్పువాయించి వారిని ఉత్తేజపరిచారు. తన రెండు నెలల వేతనాన్ని సీఎం సహాయనిధికి విరాళంగా అందించినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

రుణాల రికవరీకి దిల్లీ పోలీసులు

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండల మాజీ సమాఖ్య అధ్యక్షురాలు తంబళ్ల సీతమ్మకు దిల్లీ కోర్టు నోటీసు జారీ చేసింది. రుణాల రికవరీ కోసం దిల్లీ నుంచి ఏఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం చంద్రుగొండ చేరుకున్నారు. సీతమ్మ అందుబాటులో లేకపోవటంతో స్థానికులతో లిఖిత పూర్వకంగా లేఖ రాయించుకొని దిల్లీ పోలీసులు తిరుగు ప్రయాణమయ్యారు. 2005-06లో చంద్రుగొండ మండల సమాఖ్యకు రాష్ట్రీయ మహిళా కోష్ పథకం ద్వారా రూ.50 లక్షలు రుణం మంజూరైంది. అందులో రూ.37లక్షలు మహిళా సంఘం తిరిగి చెల్లించింది. మిగిలిన రూ.13 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఆ బకాయి వడ్డీలతో కలిసిరూ.47 లక్షలకు చేరింది. ఈ చెల్లింపుల అంశంపై దిల్లీ కోర్టులో కేసు నడుస్తోంది. వచ్చే నెల 18లోపు రుణం చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ముంపు బాధితులకు పునరావాసం కల్పించండి: మాజీ ఎంపీ

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: గోదావరి వరదల ముంపు ప్రాంతాల బాధితులకు వెంటనే పునరావాసం కల్పించాలని మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సున్నంబట్టి గ్రామశాఖ సీపీఎం మహాసభ సీతారాం ఏచూరి నగర్‌లో శుక్రవారం యానబోయిన వెంకటనర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాబూరావు ప్రసంగించారు. ఏటా గోదావరి వరదల కారణంగా సున్నంబట్టి కాశీనగరం, ఎల్.ఎన్.రావుపేట గ్రామాల ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణాల కారణంగా నష్టపోయిన నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సీపీఎం నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, వంశీకృష్ణ, చంద్రయ్య, శ్రీనుబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణలో మాజీ ఎంపీ డాక్టర్ బాబూరావు, నాయకులు

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

మణుగూరు సాంస్కృతికం, బూర్గంపాడు, కరకగూడెం, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ పేర్కొన్నారు. శుక్రవారం మణుగూరులోని జీఎం కార్యాలయంలో లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. అధికారులు శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, వెంకట రామారావు, శ్రీనివాసమూర్తి, అనురాధ, రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

✦ మణుగూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద శుక్రవారం పలు సంఘాల ఆధ్వర్యంలో లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. సీఐ సతీష్‌కుమార్, తహసీల్దారు రాఘవరెడ్డి తదితరులు లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళి అర్పించారు. పురపాలక కార్యాలయంలో కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రాఘవరెడ్డి లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు.

✦ బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జమలారెడ్డి, కరకగూడెం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగప్రసాద్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతిని టీఎన్‌జీఓ డివిజన్ అధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలో భద్రాచలంలోని సంఘ భవనంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జీఎం రాంచందర్, అధికారులు

ఏజెన్సీ పరిస్థితులపై పట్టు సాధించాం: ఏఎస్పీ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

ముఖాముఖి

భద్రాచలం పూర్తి ఏజెన్సీ ప్రాంతం కావడంతో సరిహద్దులలో మరింత కట్టుదిట్టమైన నిఘాకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ తెలిపారు. జులైలో బాధ్యతలు చేపట్టిన ఆయన సుమారు వంద రోజులు పూర్తి కావస్తున్న సందర్భంగా 'న్యూస్‌టుడే'తో పలు అంశాలపై మాట్లాడారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో విభిన్నమైన వాతావరణం ఉందన్నారు. ఏజెన్సీలో ప్రాంత పర్యవేక్షణతో పాటు ఉన్నతాధికారుల సమావేశాల్లో పలు అంశాలు గ్రహించానన్నారు. నక్సలిజం ప్రభావిత ప్రాంతం కావడంతో ఉన్నతాధికారుల సూచనలతో, నిత్యం అప్రమత్తతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. 'న్యూస్‌టుడే'తో ఏఎస్పీ తెలిపిన అంశాలు ఆయన మాటల్లోనే..


భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్

న్యూ: ఈ వృత్తిని ఎంపిక చేసుకోవడానికి గల కారణం?
ఏఎస్పీ: ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతోనే ఈ వృత్తిని ఎంపిక చేసుకున్నా. గాంధీ, అంబేడ్కర్, ఇతర జాతీయ నాయకులు ప్రజలకు ఎంతో సేవ చేశారు. మన వంతు మనం ప్రజలకు సేవ చేయాలనే కోరిక ఉంది.

న్యూ: తొలి పోస్టింగ్‌లో ఎక్కడ?
ఏఎస్పీ: 2020 బ్యాచ్‌కు ఎంపికైన నేను శిక్షణ అనంతరం తెలంగాణ రాష్ట్రంలో జనగాంలో 3 నెలలు పనిచేశా.. అనంతరం బదిలీపై భద్రాచలం వచ్చాను.

న్యూ: విద్యాభ్యాసం వివరాలు?
ఏఎస్పీ: మాది ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ (జిల్లా కేంద్రం, నివాస పట్టణం). ఒకటి నుంచి ఇంటర్మీడియట్ అక్కడే చదివిన నేను బీఏ లక్నో విశ్వవిద్యాలయంలో పూర్తిచేశాను. జాగ్రఫీలో ఎంఏ ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో చదివాను.

న్యూ: కుటుంబ నేపథ్యం..?
ఏఎస్పీ: అమ్మ నాన్న విశ్రాంత ఉద్యోగులే. నాన్న విశ్రాంత ఉపాధ్యాయులు కాగా అమ్మ నర్సింగ్ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు.

న్యూ: నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం.. ఇక్కడి సవాళ్లను ఎలా ఎదుర్కొంటారు?
ఏఎస్పీ: గతంలో ఈ ప్రాంతంలో నక్సలైట్ల ప్రభావితం అధికంగా ఉండేది. ప్రస్తుతం చాలా వరకు తగ్గింది. ఏజెన్సీ ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం. అటవీ సరిహద్దు కావడంతో భద్రాచలం మీదుగా ఇతర ప్రాంతాలకు గంజాయి తరలుతోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాలను అరికట్టేందుకు తీవ్ర కృషి చేస్తోంది. దానికి అనుగుణంగా ఉన్నతాధికారుల సూచనలతో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసి గంజాయి రవాణాను అరికట్టే చర్యలు చేపట్టాం.

మన్యంలో క్షేత్ర స్థాయికి వైద్యసేవలు

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మన్యంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించేందుకు ఐటీడీఏ పీఓ రాహుల్ సమాలోచనలు సాగిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వైద్య విధాన పరిషత్‌కు చెందిన నిపుణులైన వైద్యులు సైతం క్షేత్ర స్థాయికి వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ సేవలను అందించనున్నారు.

✦ కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, బూర్గంపాడు, అశ్వారావుపేట, ఇల్లెందు, మణుగూరు వంటి పెద్దాసుపత్రుల్లో వైద్య నిపుణులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో గైనకాలజిస్టు, పిల్లల వైద్య నిపుణులు, చర్మ వ్యాధులు, కంటి నిపుణులు పనిచేస్తున్నారు. టైం టేబుల్ ప్రకారం వీరిని ఎంపిక చేసిన మెడికల్ క్యాంపులకు పంపనున్నారు. మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలను నిర్ధారించేందుకు రక్త పరీక్షలు చేసే ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉంటారు. అవసరాన్నిబట్టి మెరుగైన చికిత్సలకు ఏరియా ఆసుపత్రులకు రిఫర్ చేసే అవకాశం ఉంది.



గత ఏడాది నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరం

ప్రత్యేక శిబిరాల ఏర్పాటుకు సమాయత్తం

తొలి విడతగా రెండు చోట్ల..

మణుగూరు పీహెచ్‌సీ పరిధిలోని రామానుజారం గ్రామంతో పాటు దుమ్ముగూడెం పీహెచ్‌సీ పరిధిలోని చెరుపల్లి గ్రామాల్లో తొలి విడతగా మెగా వైద్య శిబిరాలను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. దసరాకు ముందుగానే ఈ రెండింటిని విజయవంతం చేయాలని కసరత్తు చేపట్టారు. ప్రతి శిబిరంలో నిపుణులైన వైద్యులతో పాటు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సేవలను అందిస్తారు. గర్భిణులను పరీక్షించేందుకు స్కానింగ్ యంత్రాలను ఉపయోగించనున్నారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతారు.

✦ ఈ రెండు చోట్ల వైద్య శిబిరాల నిర్వహణ అనంతరం క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయో సమీక్షించి వాటి పరిష్కారాలను గుర్తించనున్నారు. శిబిరానికి 500 మందికి తగ్గకుండా రప్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. దసరా తర్వాత జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 30 చోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించే అవకాశం ఉంది. ఎక్కడ శిబిరం ఏర్పాటు చేయనున్నదీ ముందుగానే ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో తెలిసేలా ప్రచారం చేయాల్సి ఉంది.

కొత్తగూడెం
•కొత్తగూడెం • ఇల్లెందు

రూ.4.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు..

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలకంలోని రామవరం 6-12వ వార్డుల్లో రూ.4.70 కోట్ల డీఎంఎఫ్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పార్కుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ కె.సీతాలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, కౌన్సిలర్లు, కొత్తగూడెం తహసీల్దారు పుల్లయ్య, కమిషనర్ శేషు, ఇరిగేషన్ డీఈ రవికుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: వరంగల్‌లో జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీల్లో పతకాలు గెలుపొందిన సింగరేణి మహిళా కళాశాల క్రీడాకారులను ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, కరస్పాండెంట్ సునీల్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ చింత శారద శుక్రవారం కళాశాలలో అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689



సమస్య: కూలీలైన్ 36వ వార్డులో డ్రైనేజీల్లో పూడికతీత పనులు సవ్యంగా సాగడం లేదు. ప్రతిరోజు చెత్త తొలగించేలా చూడాలి. **- స్థానికులు**

సమాధానం: కొంతమంది చెట్ల కొమ్మలు కొట్టేసి డ్రైనేజీల్లో పడేస్తున్నారు. ప్రజలు సహకరించాలి. చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం **- నవీన్, శానిటరీ జవాన్**

– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

నేడు నిర్వాసితులతో సమావేశం

టేకులపల్లి, న్యూస్‌టుడే: 'ఎన్‌హెచ్ 930పీ' విస్తరణలో భూమి, ఇళ్లు కోల్పోనున్న బేతంపూడి, గొల్లపల్లి రెవెన్యూ గ్రామాల నిర్వాసితులతో టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షణలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగభవాని శుక్రవారం తెలిపారు. 162 మంది రైతులకు చెందిన 20.34 ఎకరాల వ్యవసాయ భూమి, 146 మంది నివాసాలు సేకరించనున్నట్లు తెలిపారు. త్వరలో మరో 5 ఎకరాలకు నోటిఫికేషన్ వెలువడనున్నట్లు తెలిపారు.

విద్యాలయాల్లో అవగాహన శిబిరాలు..

కొత్తగూడెం వ్యవసాయం: ప్రపంచ రేబిస్ డే సందర్భంగా డెయిరీ ఒకేషనల్ కళాశాల (కొత్తగూడెం), అభ్యుదయ కళాశాల (కేటీపీఎస్ కాలనీ), సిద్ధార్థ ఒకేషనల్ కళాశాల (భద్రాచలం), యూపీ హెచ్ఎస్ (సత్యనారాయణ పురం, ఇల్లెందు), ప్రాంతీయ పశు వైద్యశాల (అశ్వారావుపేట)లో అవగాహన శిబిరాలను శనివారం నిర్వహిస్తున్నారు. వివరాలను జిల్లా పశు పశుసంవర్ధక శాఖ అధికారి పురందర్ శుక్రవారం తెలిపారు.

సినిమా థియేటర్ అద్దాలు ధ్వంసం

పాల్వంచ, ఇల్లెందు గ్రామీణం: పాల్వంచ శ్రీవేంకటేశ్వర థియేటర్‌లో శుక్రవారం ఉ.5.30కు ప్రారంభించాల్సిన 'దేవర' బెనిఫిట్ షో గంట ఆలస్యమైంది. దీంతో కొందరు అభిమానులు హాల్ అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు వారిని శాంతింపజేశారు. ఇల్లెందు థియేటర్‌లో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు వేడుకలు నిర్వహించారు.

కబ్జాలిలా.. వీరినేమనాలా?

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

పురపాలకంలో నాలాలు, మురుగు కాలువలు, చిన్నపాటి గల్లీలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కబ్జాబాబుల దందాకు అంతే లేకుండా పోతోంది. వారికి కొందరు స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉంటున్నాయనే ఆరోపణలున్నాయి. ఇంకొన్ని వార్డుల్లో కంచే చేను మేసిన చందంగా స్థానిక ప్రజాప్రతినిధులే డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. ఇకనైనా పురపాలక యంత్రాంగం కళ్లు తెరవాలి. ఆక్రమణలు తొలగించి ముంపు బెడద లేకుండా చూడాలి.


36వ వార్డులో.. ఓ గల్లీలో డ్రైనేజీపై నిర్మించిన స్లాబ్..

సందులు.. గొందులు మాయం!

ఎంజీరోడ్ నుంచి చిన్నబజార్, పెద్దబజార్, నేతాజీ మార్కెట్‌కి వెళ్లేందుకు చిన్న చిన్న గల్లీలు గతంలో అందుబాటులో ఉండేవి. వాటిని స్థానికులు, పక్క నివాసాల వారు ఆక్రమించేస్తున్నారు. పలుచోట్ల వ్యాపారులు, రాజకీయ నాయకులు గల్లీలను ఆక్రమించి అడ్డగా షాపింగ్ కాంప్లెక్స్‌లు, ప్రహరీలు నిర్మించారు. ఇన్నాళ్లూ కాలిబాటకు ఉపయోగపడిన మార్గాలు ఒక్కొక్కటిగా కనుమరుగైపోతున్నాయి. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారంటూ సామాన్యుల ఇంటి నిర్మాణాలను కూల్చిన ఘటనలున్నాయి. బూడిదగడ్డ, గౌతంనగర్, ప్రగతినగర్ తదితర ఏరియాల్లో స్లాబ్‌లనూ నేలమట్టం చేశారు. కానీ బడాబాబుల ఆక్రమణలపై కన్నెర్ర చేయరెందుకని? పురవాసులు నిలదీస్తున్నారు.


శిశుమందిర్ ఏరియాలో డ్రైనేజీనే కనిపించని విధంగా సిమెంటు ఫ్లోరింగ్..

నాలాల ఆక్రమణలపై సత్వర చర్యలు

పట్టణంలోని నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటున్నాం. ఎవరు ఫిర్యాదు చేసినా సిబ్బందితో పరిశీలన చేపట్టి చట్ట ప్రకారం నడుచుకుంటాం. నాలాల ఆక్రమణలను పరిశీలిస్తాం. పురపాలక అభివృద్ధికి ఆటంకం కలిగించే పనులు చేపట్టేవారికి నోటీసులు జారీ చేస్తాం.

- శేషు, పురపాలక కమిషనర్

మచ్చుకు కొన్ని ఆక్రమణలు..

- ☆ 36వ వార్డులో ఓ ప్రజాప్రతినిధి తన ఇంటి సమీపంలో భారీ డ్రైనేజీని ఆక్రమించారు. ఆ ఏరియాలోని మురుగు ప్రవహించాల్సిన నాలాపై సిమెంట్ స్లాబ్ వేసి.. చిన్న సందును ఏర్పాటు చేసుకున్నారు.
- ☆ లేపాక్షి రోడ్‌లో ఆంధ్రాబ్యాంకు నుంచి మొదలుకుని కూరగాయల మార్కెట్ వరకు ఎడమ, కుడివైపున ఉన్న కాలువలను యథేచ్ఛగా ఆక్రమించేశారు. ఓ బడాబాబు నివాసం ముందు స్లాబ్‌ను నిర్మించేశాడు.
- ☆ రైతుబజార్ నుంచి శిశుమందిర్, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రహదారిలో మరో ప్రజాప్రతినిధి తన ఇంటి ముందున్న భారీ నాలాను ఆక్రమించేసి.. ఇంట్లోకి విశాల దారిని నిర్మించుకున్నాడు.
- ☆ గణేశ్ టెంపుల్ దేవాలయం సమీపంలో ఓ చిరువ్యాపారి ఏకంగా డ్రైనేజీతో పాటు రహదారిని కొంత ఆక్రమించి గోడ నిర్మాణం చేపట్టాడు. ఈ విషయంపై పురపాలకం అధికారులు, కలెక్టర్‌కు సైతం ఫిర్యాదులు చేసినా ఇప్పటి వరకు చర్యలు చేపట్టనే లేదు.
- ☆ రామాటాకీస్ ఏరియా నుంచి బస్టాండు వైపు వచ్చే దారిలో రోడ్డుకు కుడి వైపునున్న కాలువపై పలుచోట్ల శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. అక్కడ పారిశుద్ధ్య పనులు చేపట్టే పరిస్థితులు లేకుండా పోయాయి.
- ☆ గాజులరాజం బస్తీ, హనుమాన్‌బస్తీ ఏరియాల మధ్య ఓ గుత్తేదారుడు డ్రైనేజీని ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టాడు.
- ☆ చాలాచోట్ల ప్రధాన మురుగు కాలువలపై స్లాబులు నిర్మించి ఇళ్లల్లోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇంకొందరు బైకులు, కార్లు నిలుపుకొనేందుకు ఏకంగా కట్టడాలే నిర్మిస్తున్నా పురపాలక యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు చూస్తోంది.

వివాహిత ఆత్మహత్య

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: మానసిక సంబంధ సమస్యతో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొత్తగూడెం రెండో పట్టణ ఎస్‌హెచ్‌ఓ రమేష్ వివరాల ప్రకారం.. రామవరం ఏడో నంబర్ బస్తీకి చెందిన సంజూరాణి పాసి (28)కి ఏడేళ్ల క్రితం ఇల్లెందుకు చెందిన కిశోర్‌కుమార్ పాసీతో వివాహమైంది. వీరికి ఏడేళ్ల పాప. కొద్దిరోజులుగా సంజూ రాణి మానసిక సంబంధ సమస్యతో బాధపడుతోంది. గత 5 నెలలుగా రామవరంలోని పుట్టింట్లోనే ఉంటోంది. శుక్రవారం ఇంట్లో దూలానికి చీరతో ఉరివేసుకొని బలవన్మరణం చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

వ్యక్తిపై కోతి దాడి

జూలూరుపాడు: కాకర్లకు చెందిన దాసోజు గోపాలరావు శుక్రవారం గ్రామ కూడలిలో ఉండగా కోతి దాడి చేసింది. గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. తలకు అయిదు కుట్లు పడ్డాయి.

'పరిహారం, భూమి ఇవ్వాలని ఆదేశం'

టేకులపల్లి, న్యూస్‌టుడే: కోయగూడెం ఓసీ-2 ఏర్పాటులో భాగంగా పిట్-2, పిట్-3 పరిధిలో భూములు కోల్పోయిన వారికి భూమి, నష్టపరిహారం ఆరు వారాల్లో చెల్లించాలని హైకోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ శుక్రవారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ '2008లో సింగరేణి ఆదివాసీలు, గిరిజనులకు చెందిన సుమారు 750 ఎకరాల భూమిని సేకరించింది. నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని బాధితులు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేశారు. అదే ఏడాది హైకోర్టును ఆశ్రయించగా నిర్వాసితులకు న్యాయం చేయాలని తీర్పు వెలువడింది. కానీ నామమాత్ర పరిహారమే అందింది. 2016లో మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించాం' అని చెప్పారు.


జూనియర్ న్యాయవాది మృతికి సంతాపం

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: గుండెపోటుతో మృతిచెందిన కొత్తగూడెంకు చెందిన జూనియర్ న్యాయవాది అంకం మల్లేశ్ మృతిపట్ల ఫుల్‌కోర్టు రిఫరెన్స్ శుక్రవారం సంతాపం వ్యక్తం చేసింది. జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్, న్యాయమూర్తులు జి.భానుమతి, బి.రామారావు, ఎ.సుచరిత, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమ్మె నోటీసు అందజేత

ఇల్లెందు గ్రామీణం: ఇల్లెందు, కేటీసీ నుంచి టిప్పర్ల ద్వారా నవభారత్, బీపీఎల్ తదితర పరిశ్రమలకు బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్ల సిబ్బంది వేతనాలు పెంచాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి డిమాండ్ చేశారు. శుక్రవారం టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు నేలవెల్లి నరసింహారావుకు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వేతనాలు పెంచకుంటే సమ్మె తప్పదని డ్రైవర్లు ఈ సందర్భంగా నోటీసు ఇచ్చారు. నాయకులు శేషయ్య, మదార్ పాల్గొన్నారు.

స్విచ్ వేస్తే.. షాకే



పాల్వంచ మండలం కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాలలోని స్విచ్ బోర్డులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. మరుగుదొడ్లలో పగిలిన స్విచ్ బోర్డు వద్ద వైర్లు బయటకు వేలాడుతున్నాయి. ఎవరైనా తడి చేత్తో వాటిని ముట్టుకుంటే ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతుంది. వెంటనే మరమ్మతులు చేయిస్తామని అధికారులు 'న్యూస్‌టుడే'తో అన్నారు.

– పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

భావిపౌరుల దంత సంరక్షణ



పాల్వంచ కేటీపీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 'నవ లిమిటెడ్' సీఎస్సార్ పాలసీలో భాగంగా దంత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. నిర్వహణ సంస్థ ఎంజీఎం ప్రసాద్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన రోహిణి ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ విద్యాలయాల్లో వారం రోజులుగా వైద్య పరీక్షలు, మందుల పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మేనేజర్ శ్రీనివాసరావు, హెచ్.ఎం. లక్ష్మి, వైద్యులు అలేఖ్య, వంశీ పాల్గొన్నారు. - పాల్వంచ, న్యూస్‌టుడే

కిట్టు.. తెలిస్తే బాగు కిటుకు..



గీతకార్మికులకు 'కాటమయ్య కిట్' వినియోగంపై ఇల్లెందు జేకేకాలనీ సమీపంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఇందిర, అబ్కారీ ఎస్.ఐ. అచ్చారావు పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయలక్ష్మి, రవి, గీతకార్మికుల సొసైటీ డైరెక్టర్లు హరీష్, అంజయ్య, కృష్ణ, బాబు, రాము పాల్గొన్నారు. – ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

బూడిద చెరువును పరిశీలించిన పీవో


బూడిద కట్టను చూస్తున్న పీఓ రాహుల్

పాల్వంచ, పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: కేటీపీఎస్ యాష్‌పాండ్‌ను కేటీపీఎస్ సీఈలు మేక ప్రభాకర్‌రావు, పాలకుర్తి వెంకటేశ్వరరావుతో కలిసి ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం పరిశీలించారు. ప్రభావిత ప్రాంతాలైన కరకవాగు, పుల్లాయిగూడెం, పునుకుల, సూరారం గిరిజన గ్రామాలను సందర్శించారు. బూడిదను తరలించుకునేందుకు గ్రామాల వారికి అవకాశం కల్పించాలని పీవో ఆదేశించారు. ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్, ఎస్ఈ యుగపతి, ఈఈ రవీందర్ పాల్గొన్నారు.

'లాభాల్లో వాటా ఘనత ఏఐటీయూసీదే'

కొత్తగూడెం సింగరేణి: ఒప్పంద కార్మికులకు లాభాల్లో వాటాను సాధించిన ఘనత ఏఐటీయూసీదేనని సంఘం గౌరవాధ్యక్షుడు, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. రైటర్‌బస్తీలోని సింగరేణి సివిల్ విభాగం కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. కార్మికులతో మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, యూనియన్ నాయకులు రమణమూర్తి, క్రిష్టఫర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఐద్వా మహాసభల విజయంతానికి పిలుపు



సుజాతనగర్: కొత్తగూడెంలో అక్టోబరు 21, 22, 23 తేదీల్లో నిర్వహించే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జ్యోతి అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. శ్రీలక్ష్మి, కుమారి, నాగరత్నమ్మ, సరిత, కళ్యాణి, ఈశ్వరమ్మ, వాణి, జయమ్మ అనురాధ పాల్గొన్నారు.

ఉత్తమ విచారణాధికారికి అభినందన



జూలూరుపాడు, న్యూస్‌టుడే: ఉత్తమ విచారణ అధికారిగా జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న తిరుపతిరావు ఎంపికయ్యారు. ఆయన హైదరాబాద్‌లో ఇటీవల డీజీపీ జితేందర్ నుంచి సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. శుక్రవారం జూలూరుపాడులో ఆయన్ను సీఐ ఇంద్రసేనారెడ్డి అభినందించారు.

డ్రైవర్ల ఖాతాల్లో బోనస్ జమకు డిమాండ్

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కన్వేయన్స్ డ్రైవర్లకు ప్రభుత్వం ప్రకటించిన రూ.5 వేల బోనస్‌ను నేరుగా వారి వేతన ఖాతాలో జమ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ నబీ డిమాండ్ చేశారు. శుక్రవారమిక్కడ ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు అందరికీ బోనస్ ఇవ్వాలని కోరారు.

సీఎం దృష్టికి వీఓఏల సమస్యలు: కూనంనేని

కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల వీఓఏ(విలేజ్ ఆర్గనైజ్డ్ అసిస్టెంట్)లు శ్రమ దోపిడీకి గురవుతున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని రజబ్ అలీ భవన్‌లో శుక్రవారం భద్రాద్రి, ములుగు జిల్లాల సెర్ప్ వీఓఏల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా కూనంనేని హాజరై మాట్లాడారు. వేతనం, ఇతర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, నరాటి ప్రసాద్, రామాంజనేయులు, వాసిరెడ్డి మురళి పాల్గొన్నారు.

ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

లక్ష్మీదేవిపల్లి, ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: లక్ష్మీదేవిపల్లి నూతన ఎంఈవోగా కృష్ణయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇల్లెందు ఎంఈవోగా టీవీఆర్ఎన్ స్వామి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంపీడీవో ధన్‌సింగ్, ఉపాధ్యాయులు సన్మానం చేశారు.

పేదలందరికీ ప్రభుత్వం ఇళ్లు ఇవ్వాలి: సీపీఎం

కొత్తగూడెం సింగరేణి: పేదలందరికీ ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. సీపీఎం శాఖ మహాసభ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. నాయకులు ఎమ్మెస్ ప్రకాశ్, ప్రసాద్,బి.రమేష్, డి.వీరన్న, ఎన్.రమేష్, కె.రమేష్‌బాబు, జవహర్‌రెడ్డి, నర్సింహారావు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం నివారణకు చర్యలు: కలెక్టర్


సుజాతనగర్: ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిన్నారులు, గర్భిణులు పౌష్టికాహార లోపంతో బాధపడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి కలెక్టరేట్‌లో ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతి నెలా మొదటి వారంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు, బరువు చూసి పౌష్టికాహారం అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రక్తహీనత బారినపడకుండా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి విజేత, జిల్లా ఇమ్యూనిటీ అధికారి బాలాజీ పాల్గొన్నారు.

సమాచారం పకడ్బందీగా పొందుపరచాలి..

సుజాతనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలను 'ప్రశస్థ' యాప్‌లో పక్కాగా పొందుపరచాలని జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. సుజాతనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించి సూచనలు చేశారు. 19 ఏళ్లలోపు వారి వివరాలపై పలు అంశాలకు సంబంధించి ప్రాథమిక సర్వే నిర్వహించాలన్నారు. డీఈవో ఎం.వెంకటేశ్వరాచారి,సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ సైదులు, ఎంఈవో లీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహం సందర్శన..

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కొత్తగూడెం ఎస్సీ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. బాలికలకు అందుతున్న వసతులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అధికారి దాసరి అనసూర్య, సూపరింటెండెంట్ హనుమంతరావు, ఏఎస్‌డబ్ల్యూఓ సునీత ఉన్నారు.

'సార్వత్రిక' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అక్టోబరు 3వ తేదీ నుంచి నిర్వహించే సార్వత్రిక పది, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పలు శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. అక్టోబరు 3-9 వరకు థియరీ, 16-23 వరకు ప్రాక్టికల్స్ ఉంటాయని ఆయన చెప్పారు. పదిలో 596, ఇంటర్‌లో 631 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్షలు ఉదయం 9-మ.12, తిరిగి మ.2.30-సా.5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. డీఈవో వెంకటేశ్వరాచారి, డీఐఈవో వెంకటేశ్వరరావు, సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్

'స్వరాష్ట్ర సాధనకు లక్ష్మణ్ బాపూజీ జీవితం త్యాగం'


జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు


ఇల్లెందులో.. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, రాజేందర్..

కొత్తగూడెం పట్టణం, కొత్తగూడెం సింగరేణి, పాల్వంచ, చుంచుపల్లి, ఇల్లెందు గ్రామీణం, టేకులపల్లి, న్యూస్‌టుడే: స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో తన జీవితాన్నే ధారబోసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎస్పీ బి.రోహిత్‌రాజు అన్నారు. జయంతి వేడుకలు ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. డీఎస్పీలు సత్యనారాయణ, మల్లయ్యస్వామి పాల్గొన్నారు. ● సింగరేణి కార్పొరేట్ ప్రధాన కార్యాలయం, ఏరియా కార్యాలయాల్లో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, సంఘాల నాయకులు రమణమూర్తి, పీతాంబరరావు, విజయభాస్కర్‌రెడ్డి, జీఎం షాలేమురాజు పాల్గొన్నారు. ● కొత్తగూడెం జడ్పీ కార్యాలయంలో సీఈవో కె.చంద్రశేఖర్‌రావు, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అధికారి నవీన్, మణి మృదుల నివాళి, ఇల్లెందులోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, భారాస నాయకులు దిండిగాల రాజేందర్, సిలివేరి సత్యనారాయణ, దేవీలాల్ నాయక్, జేకే శ్రీను, శీలం రమేష్‌లు.. ఇల్లెందు ఏరియా సింగరేణి కార్యాలయంలో జీఎం జాన్ ఆనంద్, బొల్లం వెంకటేశ్వర్లు, గిరిధర్‌రావు, మోహన్‌రావు, సుధాకర్, సాయిస్వరూప్‌లు.. కేటీపీఎస్ ఐదు, ఆరు, ఏడు దశల్లో ఎస్ఈ ఏడీఎం వెంకటేశ్వర్లు, అధికారులు.. టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు.


కొత్తగూడెం సింగరేణి: ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి


పాల్వంచ కేటీపీఎస్‌లో..


టేకులపల్లి తహసీల్దార్ నాగభవాని..

సింగరేణీయులకు.. బోనస్ డబుల్ ధమాకా



కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులకు పనితీరు మదింపు ఆధారంగా అందజేసే (పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ - పీఎల్ఆర్) బోనస్‌ను చెల్లించే సమయం రానే వచ్చింది. ప్రతి ఏటా దీన్ని దీపావళికి ముందుగా చెల్లిస్తున్నారు. దీన్నే సింగరేణిలో దీపావళి బోనస్‌గా పిలుస్తుంటారు. సింగరేణి ఉద్యోగులకు లాభాల్లో వాటాను ఏటా దసరా ముందు చెల్లిస్తుండగా.. దేశవ్యాప్తంగా పనిచేసే ఈ రంగ కార్మికులకు పీఎల్ఆర్‌ను దీపావళికి ముందు అందజేస్తున్నారు. ఈ బోనస్‌పై జాతీయ కార్మిక సంఘాలతో కోలిండియా, సింగరేణి ఈ నెల 29న దిల్లీలో చర్చలు జరపనుంది. ఈ అంశంపై కోలిండియాలో సుమారు 2.5 కోట్లు, సింగరేణి 42 వేల మంది ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

గడిచిన సంవత్సరం రూ.85,500..

గతేడాది బొగ్గు పరిశ్రమల్లోని ఉద్యోగులకు రూ.85,500 మొత్తాన్ని పీఎల్ఆర్ బోనస్‌గా చెల్లించారు. ఈ ఏడాది గడిచిన సంవత్సరం కన్నా మరో లక్ష అదనంగా చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అంత మొత్తాన్ని ఎప్పుడూ పెంచనందున మరో రూ.15 వేల పెంపుదలకైనా పట్టుబట్టాలని యూనియన్లు భావిస్తున్నాయి. లాభాలు, కార్మికుల పనితీరు చర్చల్లో నిర్ణయం తీసుకోనున్నారు.

సంవత్సరం	దీపావళి బోనస్ (రూ.ల్లో)
2015	48,500
2016	54,000
2017	57,000
2018	60,500
2019	64,700
2020	68,500
2021	72,500
2022	76,500
2023	85,500

7న 'సింగరేణి' లాభాల్లో వాటా..

సింగరేణి ఉద్యోగులకు బోనస్ పండుగలుగా దసరా, దీపావళిని భావిస్తుంటారు. విజయ దశమికి ముందు అందే లాభాల్లో వాటాను 33 శాతంగా ఇప్పటికే ప్రభుత్వం, సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో అక్టోబరు 7వ తేదీన లాభాల్లో వాటాను యాజమాన్యం జమచేయనుంది. పీఎల్ఆర్ బోనస్‌ను ఈ నెల 29న నిర్ణయించి.. ఆ మొత్తాన్ని దీపావళికి కొద్ది రోజుల ముందు చెల్లించనుంది. దీంతో బోనస్‌లో డబుల్ ధమాకా అందినట్లవుతుంది.


త్రీఇంక్లైన్‌లో మొక్కకు నీళ్లు పోస్తున్న చంద్రమౌళి


రుద్రంపూర్‌లో విద్యార్థుల మానహారం

శ్రమయేవ జయతే..

చుంచుపల్లి మండలం త్రీఇంక్లైన్, రుద్రంపూర్, పాల్వంచ బస్టాండు ప్రాంతాల్లో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో శ్రమదానం, మానవహారం చేపట్టారు. డీపీవో చంద్రమౌళి, డీఎల్పీవో రమణారావు, కమిషనర్ ఢాకునాయక్, పారిశుద్ధ్య అధికారి కేవీ లక్ష్మణ్‌రావు, ఈఈ ఫరీద్ పాల్గొన్నారు. కొత్తగూడెంలోని పలు పాఠశాలల్లో పరిశుభ్రతపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్రాచారి, ఉపాధ్యాయులు, ఐటీసీ రవి పాల్గొన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం ప్రాథమిక పాఠశాలలో కొత్తగూడెం యూనియన్ బ్యాంక్ మేనేజర్ దేవరాజ్, అధికారులు నవీన్, ప్రవీణ్, భార్గవ్ నాయక్‌లు శ్రమదానం చేశారు.

– న్యూస్‌టుడే యంత్రాంగం


పాల్వంచ బస్టాండ్‌ను శుభ్రం చేస్తున్న కమిషనర్


హేమచంద్రాపురంలో బ్యాంకు అధికారులు..